# నేడు 144 సెక్షన్

మణుగూరు టౌన్, డిసెంబర్ 2: ఎన్నికల ఫలితాలు వెలువడే ఆదివారం రోజున నియోజ్యకవర్గవ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6.00 నుంచి సోమవారం ఉదయం 6.00 గంటల వరకు 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఐదుగురికి మించి గుమికూడవద్దని, వీధుల్లో బాణసంచా కాల్చవద్దని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించవద్దని, బైక్‌లతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. దీనిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా నేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, పార్టీల నాయకులు సంయమనం పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**నేడు మద్యం దుకాణాలు బంద్**

మణుగూరు టౌన్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న ఆదివారం రోజున నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం దుకాణాలు మూతపడనున్నాయి.

# 'పినపాక'లో ఇలా ఓట్లేశారు

సారపాక, డిసెంబర్ 2: పినపాక నియోజకవర్గంలో మొత్తం 1,98,402 మంది (పురుషులు–97,821 మంది, మహిళలు–1,00,577 మంది) ఉన్నారు. వీరిలో మొత్తం 1,58,978 మంది ఓటేశారు. వీరిలో పురుషులు–78,530 మంది, మహిళలు–80,446 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. మొత్తం పోలింగ్ శాతం 80.13 నమోదైంది.

**మండలాలవారీగా...**

పినపాక మండలంలో 26,260 మందికిగాను 22,430 మంది (85.42 శాతం) ఓటేశారు. మణుగూరు మండలంలో 57,498 మందికిగాను 41,829 (72.75 శాతం); బూర్గంపహాడ్ మండలంలో 48,645 మందికిగాను 37,826 మంది (77.76 శాతం); అశ్వాపురం మండలంలో 32,110 మందికిగాను 26,796 మంది (83.45 శాతం); కరకగూడెం మండలంలో 12,552 మందికిగాను 11,067 మంది (88.17 శాతం), ఆళ్లపల్లి మండలంలో 8,681 మందికిగాను 7,776 మంది (89.57 శాతం); గుండాల మండలంలో 12,656 మందికిగాను 11,254 మంది (88.92 శాతం) ఓటేశారు. పాల్వంచలోని అనుబోస్ కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 244 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్లను 18 రౌండ్లలో ఎన్నికల సిబ్బంది లెక్కిస్తారు.

# భగవద్గీత కంఠస్థ పోటీలు


విద్యార్థులతో పోటీల నిర్వాహకులు

భద్రాచలం, డిసెంబర్ 2: భద్రాచలం పట్టణంలోని అహోబిల మఠంలో శనివారం భగవద్గీత కంఠస్థ, చిత్రలేఖన పోటీలు జరిగాయి. వాసవీ ప్రజ్ఞా వేదిక ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలను వాసవీ క్లబ్ సారపాక గ్రేటర్, వాసవీ వనిత క్లబ్ నిర్వహించాయి. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్, త్రివేణి స్కూల్, కోమల విద్యామందిర్, రూపా స్కూల్, సరస్వతి శిశు మందిర్, సెయింట్ పాల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రజ్ఞా వేదిక చైర్మన్ కేతేపల్లి ప్రవీణ్ బహూకరించారు. న్యాయ నిర్ణేత రామ్మూర్తి, 'వాసవీ' బాధ్యులు కంచర్ల వీరభద్రం, బచ్చు సతీశ్, పచ్చిపులుసు లలిత కుమారి పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశ గడువు పెంపు

బూర్గంపహాడ్, డిసెంబర్ 2: 2023–24 విద్యాసంవత్సరానికి బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి గడువును 11వ తేదీ వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ చిన్నా, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్‌లో చేరేందుకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదని, 14 ఏళ్లు నిండితే చాలని పేర్కొన్నారు. కేవలం ఐదు సబ్జెక్టులతో ఒకే ఏడాదిలో ఇంటర్ పూర్తిచేయవచ్చని తెలిపారు. ఓపెన్ సర్టిఫికెట్లు రెగ్యులర్ టెన్త్/ఇంటర్‌తో సమానమని, ఎలాంటి తేడా లేదని స్పష్టం చేశారు. ఓపెన్ ఇంటర్‌తో జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు, ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారానికి 9701916240 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

## ముమ్మరంగా వరి కోతలు

సారపాక, డిసెంబర్ 2: బూర్గంపహాడ్ మండలంలోని సంజీవరెడ్డిపాలెం, ఇరవెండి, మోతె పట్టీనగర్, పోలవరం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలవ్యాప్తంగా 1,600 మంది రైతులు 6,400 ఎకరాల్లో వానాకాలం వరి పంట సాగు చేశారు. ఇప్పటివరకు 30 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పెనుబల్లి, డిసెంబర్ 2: వాతావరణ మార్పులతో రైతన్నలు ఆందోళనతో హడావిడిగా వరి కోయిస్తున్నారు. మండలవ్యాప్తంగా ఇప్పటికే కొందరు రైతులు కల్లాలపై ధాన్యం ఆరబోశారు.

తల్లాడ, డిసెంబర్ 2: వాతావరణ మార్పుతో రైతుల్లో ఆందోళన మొదలైంది. 4వ తేదీ లోపు తుఫాన్ ప్రభావం ఉంటుదన్న వార్తలతో అప్రమత్తమయ్యారు. హడావుడిగా వరి కోయిస్తున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పినపాక, డిసెంబర్ 2: మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన కొమరం జ్యోత్స్న (13) అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. అంత్యక్రియలకు పినపాక ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు.

## స్వాముల నగర సంకీర్తన

తల్లాడ, డిసెంబర్ 2: మండలంలోని కుర్నవల్లిలో అయ్యప్ప మాలధారులు శుక్రవారం రాత్రి నగర సంకీర్తన నిర్వహించారు. గురుస్వాములు అన్నెం కోటిరెడ్డి, అయిలూరి శేషురెడ్డి, గూడూరు శ్రీనివాసరెడ్డి, అయిలూరి భిక్షారెడ్డి, బోడేపూడి పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

**ప్రత్యేక పూజలు**

కారేపల్లి, డిసెంబర్ 2: స్థానిక సాయిబాబా మందిరంలోని పీఠం వద్ద అయ్యప్ప మాలధారులు శనివారం అభిషేక పూజలు చేశారు. గురుస్వాములు గొడుగు శ్రీనివాస్, జంగా వెంకటేశ్వర్లు, పాలిక సారయ్య, బాలకృష్ణ, పాలిక శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్ అందజేత

వైరా రూరల్/వైరా టౌన్, డిసెంబర్ 2: మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి లాలి కృష్ణప్రసాద్‌కు ల్యాప్‌టాప్‌ను లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ శనివారం అందించారు. క్లబ్ బాధ్యులు వుండ్రు శ్యామ్‌బాబు, తోటకూర శ్రీకాంత్, పారుపల్లి కృష్ణారావు, గంగవరపు కిషన్, వుయ్యూరు రామకృష్ణ, కె.గోపి పాల్గొన్నారు.

## మద్యం షాపులు ప్రారంభం

సత్తుపల్లి, డిసెంబర్ 2: నూతన మద్యం పాలసీ కింద లాటరీలో షాపులు దక్కించుకున్న యజమానులు వాటిని శుక్రవారం ప్రారంభించారు. సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 23 షాపులు ఉన్నాయి.

## కరాటేలో గోల్డ్ మెడల్

సత్తుపల్లి, డిసెంబర్ 2: పట్టణంలోని కేజీఆర్ సీఎస్ఆర్ ఆదిత్య పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న టి.విజ్ఞల్ సాయి గౌరవ్.. అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. అతడిని పాఠశాల కరస్పాండెంట్ వైష్ణవి, డైరెక్టర్లు కె.అవినాష్, సిహెచ్.హరీష్, వివిఎస్.ప్రసాద్, ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ చైతన్య, ఉపాధ్యాయులు, కోచ్ శనివారం అభినందించారు. పునకోసి షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కజకిస్తాన్ దేశంలో ఇటీవల కరాటే పోటీలు జరిగాయి. పది దేశాల నుంచి క్రీడాకారులతో విజ్ఞల్‌సాయి తలపడి విజేతగా నిలిచి, గోల్డ్ మెడల్ అందుకున్నాడు.

## ఖోఖో పోటీలకు ఎంపిక

మధిర రూరల్, డిసెంబర్ 2: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో మండలంలోని మాటూరు హైస్కూల్ విద్యార్థిని మేడిశెట్టి మహాలక్ష్మి ప్రతిభ కనబర్చి అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయికు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం చెరుపల్లి శ్రీహరి తెలిపారు. మహాలక్ష్మి గత సంవత్సరం జరిగిన జాతీయస్థాయి ప్రతిభా ఉపకార వేతనాల పరీక్ష ఎన్ఎంఎంఎస్‌లో ఎంపికైందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు. క్రీడల్లో విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దుతూ ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా కృషి చేస్తున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని గుంటుపల్లి రమాదేవి, విద్యార్థిని మేడిశెట్టి మహాలక్ష్మిని గ్రామసర్పంచ్ మేడిశెట్టి లీలావతి, ఎంపీటీసీ అడపాల వెంకటేశ్వర్లు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మేడిశెట్టి రామకృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మధిర, డిసెంబర్ 2: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మధిర సీఐ వసంతకుమార్ హెచ్చరించారు. శనివారం మధిరలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఎన్నికల లెక్కింపు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి విజయోత్సవ ర్యాలీ, డీజేలు పెట్టి బైక్ ర్యాలీలు, పటాకులు కాల్చడం చేయకూడదన్నారు. ప్రజలు ఒకేచోట గుమిగూడటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ నెల 5 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ప్రజలు పోలీసుశాఖ వారికి సహకరించాల్సిందిగా కోరారు. మద్యం అమ్మకాలపై కూడా నిషేధం విధించారని, ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు**

తిరుమలాయపాలెం, డిసెంబర్ 2: ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై వరాల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫలితాల అనంతరం ప్రభుత్వ అనుమతి లేకుండా పటాకులు కాల్చడం, డీజేలతో ప్రదర్శనలు చేయవద్దని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబురాలు చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని తెలిపారు.

## రామయ్యకు స్వర్ణ తులసి పూజలు


రామయ్యకు పట్టాభిషేకం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 2: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శనివారం స్వర్ణ తులసి పూజలు చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని, నిత్య కల్యాణం పూర్తయిన తరువాత అదే వేదికపై రామయ్యకు పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. రామయ్యకు రాజదండం, రాజ ఖడ్గం, రాజ ముద్రిక, ఛత్రం, శంఖు చక్రాలు, జీయర్ స్వామి సమర్పించిన సామ్రాట్ కిరీటం, భక్త రామదాసు చేయించిన ఆభరణాలతో స్వామి వారిని అలంకరించారు. పట్టాభిషేకం పూర్తయిన తర్వాత అర్చకులు నదీ జలాలను భక్తులపై ప్రోక్షించారు.

## డాక్టర్ తెల్లం వెంకట్రావుకు సత్కారం


వెంకట్రావును సత్కరిస్తున్న నాయకులు

భద్రాచలం, డిసెంబర్ 2: భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును ఆ పార్టీ మండల నాయకులు శనివారం శాలువా కప్పి సత్కరించారు. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న కొద్ది రోజులకే ఎన్నికల్లో నిలబడి, రేయింబవళ్లు నిర్విరామంగా శ్రమించడం ఆయనకే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు, వెంకటాపురం మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, చర్ల ఏఎంసీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, నాయకులు తాళ్లపల్లి రమేష్‌గౌడ్, ఎండీ నవాబ్, రాజేంద్రవర్దన్ తదితరులు పాల్గొన్నారు.


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**WANTED**

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేల కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830. NT-314461

**HOUSE FOR SALE**



★ఖమ్మం సూర్యానగర్‌లో దరిపల్లి ఇంజనీరింగ్ కాలేజ్ దగ్గర నూతనముగా నిర్మించిన ఇల్లు 25 లక్షలలో అమ్మకానికి కలవు. సంప్ర : 8185821113 KMM

**WANTED**

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-314353-All

**WANTED**

★హైదరాబాద్‌లో వృద్ధులను వారి ఇంట్లోనే ఉండి చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీతం: 14-25 వేలు. ఏజెంట్ కమీషన్: 3-5 వేలు. 20-50 సం||. హేమ హోంకేర్: 7330746999. NT-320941-All




**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.